క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

కౌటాల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి గురువారం అప్పగించినట్లు ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ రవీంద్రనగర్ గ్రామానికి చెందిన అనిల్ మండల్ ఇటీవల తన రూ.16 వేల విలువ గల సెల్‌ఫోన్‌ను బోదంపల్లి సమీపంలో పోగొట్టుకున్నారని తెలిపారు. సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఆలయంలో 'పాల్వాయి' పూజలు



హరీశ్‌బాబును సన్మానిస్తున్న సభ్యులు

కౌటాల: హైదరాబాద్‌లోని మల్లంపేట్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం పూజలు చేశారు. ఆలయంలో నిర్వహించిన సుదర్శనయాగంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కౌటాల: కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కౌటాల ఏడీఈ రాజేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈజీగాం 133కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు, మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

10న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈనెల 10న పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సునీల్‌మసాదే, సిర్ప అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 1963 నుంచి 1971 వరకు టెన్త్ చదువుకున్న పూర్వవిద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. ఉదయం 9.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సినీ నటుడు ప్రదీప్ హాజరవుతారని తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఉన్నతాధికారులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు రవికాంత్ ఆధ్వర్యంలో సందర్శించారు. పాఠశాలలో ఉన్నతి కార్యక్రమాల అమలు తీరును, 10వ తరగతి విద్యార్థుల లక్ష్య కార్యక్రమాలను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశమై బోధనా అభ్యాస కార్యక్రమాలపై పలు సూచనలు చేసి ఉన్నత కార్యక్రమాల అమలుపై మరిన్ని సూచనలు చేసి అభినందించారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మందమర్రికి వివేక్ రాక

మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచి మెదటిసారిగా శుక్రవారం గడ్డం వివేక్ వెంకటస్వామి మందమర్రికి రానున్నారు. జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు నివాసంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నుంచి పలువురు నాయకులు చేరే అవకాశం ఉందని పలు వురు పేర్కొంటున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ నాయకులు చాలా మంది ఎన్నికల స మయంలో డబ్బుల పంపిణీ చేయలేదని మాజీ ఎమ్మెల్యే సుమన్ ఆ పార్టీ నాయకులను మందలించాడని తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని బీఆర్‌ఎస్ నాయకులు అనుకుంటున్నట్లు తెలుస్తుంది.

సమస్యల్లో పాటగూడ

- పూరి గుడిసెల్లోనే జీవనం
- రాళ్లుతేలి రోడ్డు అధ్వానం
- అవస్థలు పడుతున్న ఆదివాసీలు



పాటగూడ గ్రామం

కెరమెరి: మండలంలోని పాటగూడ గ్రామం సమస్యలకు నిలయంగా మారింది. అధ్వానంగా రోడ్లు, ఇళ్లు, తాగునీరు వసతులు లేవు. ఏళ్లుగా అవస్థలు ఎదుర్కొంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆదివాసీలు వాపోతున్నారు. గ్రామంలో తాగునీరు, పక్కా ఇళ్లు, ఆలయాలు లేక సతమతమవుతున్నారు. మండలంలోని పాటగూడ గ్రామంలో 42 కుటుంబాలు ఉండగా, 220 జనాభా ఉంది. 60 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ గ్రామం నేటికి అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి ఆదివాసీల బతుకులు మారడం లేదు. గతంలో ఎన్నోవిడతలుగా ప్రభుత్వ గృహాలు మంజూరు చేసినా ఒక్కటి కూడ దక్కలేదు. ఫలితంగా నేటికి వారు పూరి గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

బడిలేదు..కంకరోడ్డుతో సరి

విద్యార్థులకు బడి లేకపోవడంతో ఇతర పాఠశాలల్లో చదువుకుంటున్నారు. గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఉండడంతో చిన్నారులకు పౌష్టికాహారం లభిస్తుంది. గ్రామంలో తారు రోడ్డు ఐదేళ్ల క్రితం వేసినప్పటికి ప్రస్తుతం కంకర తేలి నడిచేందుకు యోగ్యంగా లేకుండా పోయింది. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయడంతోపాటు, రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ఆదివాసీలు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా..

గ్రామంలో ప్రస్తుతం రెండు చేతిపంపులు ఉన్నాయి. మిషన్ భగీరథలో భాగంగా లక్షలు వెచ్చించి ట్యాంకు నిర్మించారు. నల్లాలు అమర్చారు. కాని అవి అలంకారప్రాయంగా మారాయి. ఉన్న బావిపై ఎలాంటి పై కప్పు లేకపోవడం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికి చాలా కుటుంబాలు బావి నీటిని వాడుకుంటున్నాయి.



అలంకార ప్రాయంగా మంచినీటి పథకం



కంకర తేలిన పాటగూడ రోడ్డు

పట్టించుకోవాలి



గ్రామంలో 50 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం. నేటికి ప్రభుత్వ గృహం మంజూరు కాలేదు. గ్రామంలో ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు లేదు. పూరి గుడిసెల్లోనే ఉంటున్నాం. అధికారులు, పట్టించుకోవాలి. – ఆత్రం పావుగా పటేల్

నడిచే వీలు లేదు



గతంలో వేసిన తారురోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ కంకర తేలి నడిచేందుకు యోగ్యంగా లేకుండా పోయింది. బడి లేకపోవడంతో చిన్నారులకు ఇబ్బందిగా ఉంది. – సిడాం గంగుబాయి, పాటగూడ



పత్తి చేను

వ్యవసాయ పనులకు బ్రేక్

దహెగాం: మిచాంగ్ తుపాను కారణంగా వ్యవసాయ పనులకు బ్రేక్ పడింది. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలో పత్తి తీత, వరి కోత పనులు నిలిచిపోయాయి. ఆరబెట్టిన ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. వర్షాల కారణంగా పంటలకు నష్టం కలుగుతుందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.



వరి పంట

అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో ఈ నెల 8న జిల్లా స్థాయి అయ్యప్ప స్వాముల మహా సంగమం, మండల పడి పూజను పురస్కరించుకొని అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు గురువారం శ్రీరాంపూర్ కాలనీలోని భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప, గణపతి, కుమార స్వాముల చిత్రపటాలతో కాలనీ పురవీధుల్లో అయ్యప్ప స్వామి నామస్మరణతో సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారతీయ ధర్మ ప్రచార సభ శ్రీరాంపూర్ శాఖ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాజేశం, ఉపాధ్యక్షులు చందర్, స్వాములు శివకుమార్, రవికృష్ణ, సురేందర్, ఐలయ్య, హరీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

కాంగ్రెస్ సంబురాలు



కెరమెరి: టపాసులు కాలుస్తున్న కార్యకర్తలు



బెజ్జూర్: టపాసులు కాలుస్తున్న నాయకులు

కెరమెరి/లింగాపూర్/బెజ్జూర్/జైనూర్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంపై గురువారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కెరమెరిలోని ప్రధాన రహదారి వద్ద టపాసులు కాల్చారు. నాయకులు కుసుంబ్‌రావు, సుదర్శన్, లింబారావు, గిడ్డప్ప, కుత్‌బొద్దిన్, రమేశ్, శంషు, రాజు, తదితరులు ఉన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుస శంకర్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. లింగాపూర్‌లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. జైనూర్‌లో జరిగిన సంబురాల్లో పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాథ్, మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, నాయకులు ఉన్నారు.

రేవంత్ ప్రమాణస్వీకారానికి వెళ్లిన నాయకులు

రెబ్బెన: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురువారం తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల ప్రమాణస్వీకారం కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. నాయకులు కిషన్‌గౌడ్, దుర్గం రవీందర్, కిశోర్, పస్తం పోశం, రాజు తదితరులు పాల్గొన్నారు.



వెళ్తున్న నాయకులు

ప'రేషన్'

- కార్డుల్లో కొత్త పేర్లు చేరక లబ్ధిదారుల తిప్పలు
- నరుకులు, పథకాలకు దూరమవుతున్న అర్హులు



రెబ్బెనలో రేషన్ షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

రెబ్బెన: రేషన్‌కార్డుల్లో అర్హుల పేర్లు చేర్చకపోవడంతో లబ్ధిదారులు తిప్పలు పడుతున్నారు. దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా వారికి నిరీక్షణ తప్పడం లేదు. కొత్త రేషన్‌కార్డులతోపాటు అర్హుల పేర్లు చేర్చడంపై గత ప్రభుత్వం 2018లో దరఖాస్తులు ఆహ్వానించింది. మండలంలో వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలన పూర్తి కాగా, ప్రస్తుతం అవి జిల్లా పౌర సరఫరా అధికారి పరిశీలనలోనే మిగిలిపోయాయి. ఈ ప్రక్రియ దరఖాస్తులకే పరిమితమైంది.

ప్రభుత్వ పథకాలకు దూరం

సంక్షేమ పథకాల అమల్లో భాగంగా అర్హుల ఎంపికకు యంత్రాంగం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటోంది. ప్రతీ పథకానికి రేషన్‌కార్డును లింక్ చేస్తోంది. దీంతో ఇతర పథకాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేస్తే కార్డు లేదనే సాకుతో అధికారులు తిరస్కరిస్తున్నారు. ఫలితంగా వారు పథకాలకు దూరమవుతున్నారు. అయినప్పటికి కొత్తకార్డుల జారీ, పాత కార్డుల్లో అర్హుల పేర్లు చేర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్తున్న ఆడపిల్ల పేర్లను తల్లిదండ్రుల కార్డులో నుంచి తొలగిస్తుండగా అత్తారింటి కార్డుల్లో పేర్లు చేర్చడం లేదు. అయితే గత కొన్నేళ్లుగా కొత్త కార్డులు లేకపోవడం, పాతకార్డుల్లో పేర్లు చేర్చకపోవడం మూలంగా ఆపద సమయంలో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు పొందలేకపోతున్నారు.

ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు



ఆహారభద్రత కార్డులో నా కుమారుడి పేరు లేకపోవడంతో ఆరోగ్య శ్రీ కార్డు వర్తించడం లేదు. ఆర్థికస్థోమత లేక ఆరోగ్య శ్రీ ద్వారా ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించాలనుకున్నాం. రేషన్ కార్డులో పేరు లేదని ఆరోగ్య శ్రీ వర్తించదని వైద్యం నిరాకరించారు. – గుజ్జ తిరుపతి

పిల్లల పేర్లు చేర్చాలి



కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. తమకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. తన ఇద్దరు పిల్లల పేర్లు కార్డులో చేర్చాలని దరఖాస్తులు చేశాం. ఇప్పటికి కార్డులో పేర్లు ఎక్కలేదు. – దుర్గం కిరణ్

చర్యలు తీసుకోవాలి



రేషన్‌కార్డులో అర్హుల పేర్లు చేర్చాలని వచ్చిన దరఖాస్తులకు పరిష్కరించాలి. కొత్త కార్డులు మంజూరు చేయలేదు. నాలాంటి ఎంతో మందికి కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లు చేర్చలేదు. అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలి. – దుర్గం రవీందర్

గ్రంథాలయ పుస్తకాలు వినియోగించాలి



పుస్తకాలను చదివిస్తున్న రాజు

కెరమెరి: రూం టు రీడ్‌లో భాగంగా పాఠశాలలకు అందించిన గ్రంథాలయ పుస్తకాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని లిటరసీ ఫెసిలెటర్ రాజు అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. వివిధ రకాల కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటి వల్ల మేధోమదనం జరగడంతో పాటు నూతన కథలు తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. హెచ్‌ఎం వనిత ఉన్నారు.



విద్యార్థినితో చదివిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: విద్యార్థులకు చదవడం, రాయడం రావాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులను చదివించి, రాయించారు. 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులందరికీ చదువు రావాలన్నారు. ప్రతీరోజు ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో హాజరువేయాలని చెప్పారు.

సంకల్పం ఉంటే సాధించవచ్చు

- ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్

శ్రీరాంపూర్: సంకల్ప బలం గట్టిగా ఉంటే దేనినైనా సాధించవచ్చని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థిని, విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయానికి వైకల్యం ఎప్పుడు అడ్డురాదన్నారు. ఒక లక్ష్యాన్ని పెట్టుకొని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్లు అరవిందరావు, ఆనందకుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, స్పోర్ట్స్ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ చాట్ల అశోక్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న రఘుకుమార్

చెన్నూర్ మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్‌గా దేవేందర్



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నూర్: స్థానిక మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌గా టేకుమట్ల దేవేందర్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. దేవేందర్ 2019లో మైనార్టీ గురుకుల పాఠశాలలో పీజీటీగా చేరారు. దేవేందర్ ఉపాధ్యాయ వృత్తితో పాటు పాఠశాలలో పలు బాధ్యతలు నిర్వహించారు. దేవేందర్‌ను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పీజీటీ నుంచి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన దేవేందర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ ఖాజా యాజకోద్దీన్, ఎండీ మోహసిన్ ఖాన్, ఎండీ నజీర్ హైమద్, హిత్యాజ్‌ఖాన్, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ

వేమనపల్లి: మండలంలోని నాగారాం గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీ యువతకు ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ సహకారంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు యువతకు వాలీబాల్ స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముల్కల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నైతం శంకర్, రమేష్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీని గెలిపించాలి'

శ్రీరాంపూర్: రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు తెలిపారు. ఎస్‌ఆర్పీ 3, 3ఏ గనిపై గురువారం ఆయన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోల్‌బెల్ట్ పరిధిలోని 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు కార్మికవర్గం అఖండ మెజారిటీ ఇచ్చి ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. ఇదే స్ఫూర్తితో 11 సింగరేణి ఏరియాలో ఐఎన్‌టీయూసీని కార్మికులను ఆదరించి గెలిపించాలన్నారు. సింగరేణిలో కార్మికులకు హక్కులు కల్పించిన చరిత్ర తమకే ఉందన్నారు. ఎన్నికల్లో తాము ఎవరితో పొత్తు ఉండడం లేదని తెలిపారు. దీనిపై తమ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వేజ్‌బోర్డు సభ్యులు జనక్‌ప్రసాద్ ఇదివరకే స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 20మంది కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యామ్, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, తిరుపతిరెడ్డి నాయకులు తదితరలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రావు

వెడ్మ బొజ్జును కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును హైదరాబాద్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. బొజ్జుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జన్నారం మండల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కలిసిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, ఎంపీటీసీ రియాజోద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పార్టీ నాయకులు రాజశేఖర్, సుభాష్ రెడ్డి, నందు నాయక్, వెంకటరాజం, కరుణాకర్, సయ్యద్ ఇస్సాక్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.